క్లుప్తంగా

సీఎం చరిత్ర సృష్టించారు

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి



సాలిందాపూర్‌లో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న శేరి రాజేశ్‌రెడ్డి తదితరులు

బొంరాస్‌పేట: పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర సృష్టించారని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సాలిందాపూర్‌లో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ రూ.2కే బియ్యం పంపిణీ చేశారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. బుధవారం నుంచి మండలంలో సన్నబియ్యం పంపిణీ చేస్తామని తహసీల్దార్ పద్మావతి, ఆర్ఐ శిరీష తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింలునాయుడు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నాపరాతి లారీలు



పోలీసులు పట్టుకున్న లారీలు

తాండూరు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నాపరాతి లారీలను కరన్‌కోట్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా అధికలోడ్‌తో వెళ్తున్న నాలుగులారీలు (గోడరాయి)తో, మరో మూడు లారీలు(నాపరాతి బండల)తో వెళ్తున్న వాటిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాలుగు లారీలకు రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. మిగత మూడు బండల లారీలకు సంబంధించి తాండూరు మైన్స్ అధికారులకు నివేదిక పంపిచామన్నారు. కొన్ని రోజులుగా తాండూరు మండలంలో రాయల్టీ లేని లారీలను మైన్స్, పోలీస్ అధికారులు తనిఖీలు చేస్తున్న విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా లారీలు నడిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

చేవెళ్ల: కోర్టుల్లో న్యాయవాదుల సమస్యలు, కోర్టు సమస్యలను పరిష్కరించుకునేందుకు బార్ అసోషియేషన్ తరఫున కృషి చేస్తామని చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల కోర్టులోని బార్ అసోసియేషన్‌లో మంగళవారం నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాదులు రవిశంకర్‌గౌడ్, పాండురంగారెడ్డి నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అందరం కలిసి చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్‌ను అభివృద్ధి చేసుకుందామన్నారు. నూతన కమిటీలో బాధ్యతలు స్వీకరించిన వారిలో ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, నర్సింలు, ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి యాదగిరిగౌడ్, ట్రెజరర్ రవీందర్‌రెడ్డి, లైబ్రేరియన్ మల్లేశం, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, మహిళా ప్రతినిధి గీతా వనజాక్షి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు యాదయ్య, ప్రదీప్‌రెడ్డి, ప్రశాం, శివరాజ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

రాజీవ్ యువ వికాస్‌ను సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బన్సిలాల్ కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ మీడియాతో మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 5వరకు అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ గడువును ఈ నెల 14 వరకు పొడిగించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని యువత ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వేసవి దుక్కులతో మేలు

- తేమను నింపుకొనే శక్తి పెరుగుతుంది
- కలుపు మొక్కలు నివారించొచ్చు
- మండల వ్యవసాయాధికారి జ్యోతి



నవాబుపేట: యాసంగి పంటల కాలం పూర్తి కాగానే మెట్ట భూములన్నీ ఖాళీగా మారుతాయి. అలా వాటిని ఉంచడం కంటే వేసవిలో దుక్కులు దున్నుకోవడం మేలని అధికారులు వివరిస్తున్నారు. భూసార పెంపునకు పచ్చిరొట్ట పెంచడం వంటివి చేస్తే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. పంటలను ఆశించే పురుగులు ఇప్పుడు నిద్రావస్థలో ఉంటాయి. దుక్కులు దున్నితే పురుగులు పైకి వచ్చి పక్షులకు ఆహారమవుతాయి. లేదా ఎండకు చనిపోతాయి. శిలీంద్ర బీజాలు కూడా భూమి లోపలి పొరల నుంచి బయకు వస్తాయని నవాబుపేట మండల వ్యవసాయాధికారి జ్యోతి రైతులకు సూచిస్తున్నారు.

దుక్కులతో ప్రయోజనాలు ఇలా..

- వేసవిలో దుక్కులు దున్నడం వలన భూమిలో తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది.
- భూమిలోని గట్టి పొరలు విడిపోయి భూమి గుల్ల అవుతుంది.
- సూక్ష్మజీవులు, వానపాములు పెరిగి సేంద్రియ ఎరువులు పెరుగుతాయి.
- కలుపు మొక్కలు నశిస్తాయి.
- భూమి సారవంతమవుతుంది. ఎరువులు, పెస్టిసైడ్స్ తక్కువగా ఉపయోగించడం వల్ల లాభాలు పొందే అవకాశం ఉంటాయి.
- లోతైన దుక్కుల వలన లోపలి వరకు భూమి పొరలుగా విడిపోయి మొక్కల వేళ్లు కూడా లోపలి వరకు చేరుకునే అవకాశాలు మెరుగుపడుతాయి.
- క్షారాలు, లవణాలు భూమి లోపలి పొరలకు చేరుకుని పైభాగం సరైన పీహెచ్‌లో తయారవుతుంది.
- గత పంటకు సంబంధించిన మొక్కలు, వేళ్లు భూమిలో కుళ్లిపోయి ఎరువుగా మారుతాయి. ఎలుకల బెడద తగ్గిపోతుంది, గత పంటకు చెందిన అవశేషాలు, మొక్కల వేర్ల ద్వారా విష పదార్థాలు విడుదలైతే అవి పూర్తిగా నశిస్తాయి.
- వాలు అడుగుకు దుక్కులు దున్నడం వలన నేల కోతకు గురికాకుండా ఉంటుంది.
- వేసవిలో పొలాలను దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీటిని, పోషకాలను లాగేస్తాయి. పంట సమయానికి భూమిని నిస్సారంగా మారుస్తాయి. దుక్కులు దున్నడం వల్ల నీటి బెడద తగ్గుతుంది.
- ముందుగానే దుక్కులు దున్నడం వల్ల వానా కాలం పంటలే వేసుకునేందుకు మార్గం సుగమమం అవుతుంది.
- వేసవిలో కురిసే అకాల వర్షాలను ఉపయోగించుకొని నేల తడిగా మారిన తర్వాత కనీసం 25 నుంచి 3 సెంటీమీటర్ల లోతుకు దున్నుకోవాలి. ఈ దుక్కుల కోసం ప్రత్యేకంగా అరక నాగలి, పల్లపు నాగలి ఉపయోగించాలి. యంత్రాలతో దున్నాలంటే డిస్క్ టిల్లర్, రోటోవేటర్‌లు వినియోగించుకోవాలి. అరక నాగలి పైకి వచ్చిన మట్టి పెళ్లలను కూడా పొడిగా మార్చేస్తుంది. రాళ్లు ఎక్కువగా ఉన్న చోట పల్లపు నాగలి ఉపయోగించాలి. దేసే సమయంలో మట్టి పెళ్లలు లేస్తే దంతె సేద్యం ద్వారా పొలాలు చదును చేసుకోవాలి. దీని వల్ల గతంలో పంట అవశేషాలు కూడా బయటకు వస్తాయి. అంతే కాకుండా వర్షపు నీరు భూమిలోకి తొందరగా ఇంకడంతో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. నీరు పారి భూమి కోతకు గురికాకుండా నేలను వాలుకు అడ్డంగా దున్నాలి. దుక్కులు దున్నేటప్పుడు అందులో చెరువు మట్టి కలిపి దున్నుకోవడం, కంపోస్టుతో పాటు పచ్చిరొట్ట ఆకులు కలపడం వల్ల అవి మురిగి ఎరువుగా మారుతాయి. దాని వల్ల పంటలకు ఎంతో ఉపయోగకరంగా మారుతాయి.



నారెగూడలో ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

నీరందక ఎండుతున్న పంటలు

- తూముకు మరమ్మతులు చేపట్టని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

పరిగి: మండల పరిధిలోని మిట్టకోడూర్ గ్రామంలో చెరువు నిండా నీలున్నా సాగు చేసిన వరి పంటలు ఎండుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు నిండా నీరు ఉండడంతో తూంల నుంచి పంటలకు నీరు పారడం లేదు. ప్రతి ఏటా తూం మరమ్మతులు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవిస్తే ఎవరూ పట్టించుకోలేదని రైతులు వాపోయారు. ప్రస్తుతం చేతికందే సమయంలో పంటలు ఎండుతుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. తూంనుంచి నీరు రావడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో చేసేదేమి లేక ఆయకట్టు వెనుక ఉన్న రైతులు మంగళవారం తూంలో ఏం సమస్య ఉందోనని చెరువులోకి దిగి మరమ్మతులు చేపట్టారు. తూంలో ఇరుక్కున్న చెత్తా, చెదారం, కర్రలను తొలగించడంతో కొంత మేర నీరు పారుతుందని రైతులు తెలిపారు. ఈ విషయంలో అధికారులు స్పందించి తూంలను మరమ్మతులు చేయించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



తూముకు మరమ్మతులు చేస్తున్న రైతులు

ఎన్నికల హామీలు అమలు చేస్తాం

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మల్లేశ్‌యాదవ్ తదితరులు

మర్పల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్వామిదాస్ రేషన్‌షాపులో తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు 6 కిలో లవంతున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్పల్లి మండలంలో 27 గ్రామ పంచాయతీలకుగాను 35 రేషన్ దుఖాణాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ దుకాణాల నుంచి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు నాగేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీష్, మండల ఉపాధ్యక్షుడు సర్వేశ్, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు గణేష్, స్థానిక మండల నాయకులు పంతులుబాయి శ్రీనివాస్, నర్సింలు యాదవ్, రఘు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

గెలుపోటములు సహజం

జీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గోవర్దన్ ముదిరాజ్

దోమ: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గోవర్దన్ ముదిరాజ్ పేర్కొన్నారు. స్నేహితుడి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. దోమ మండలం ఐనాపూర్ గ్రామంలో శ్రీనివాస్ మృతి చెందడంతో తనస్నేహితులు గ్రామస్తులతో కలిసి క్రికెట్ టోర్ని నిర్వహించారు. మూడురోజులుగా కొనసాగుతున్న టోర్నిలో భాగంగా మంగళవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గోవర్దన్ ముదిరాజ్ మాట్లాడుతూ..క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. ఆటల్లో వచ్చే మనస్పర్థలను అక్కడే వదిలేయాలన్నారు. యువత క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు, సాయికుమార్, మేకల ప్రవీణ్‌కుమార్, మేకల శ్రీనివాస్, విజయభాస్కర్, రమేష్, విశ్వభానురెడ్డి, దిలీప్‌కుమార్, గోపాల్, అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ముసుగులో పోలీస్ రాజ్యం

సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్

చేవెళ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాల మీద నాయకుల మీద నిర్బంధం పెరిగిందని ప్రజాపాలన ముసుగులో పోలీస్ రాజ్యం చేస్తోందని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు అనేక మాయమాటలు చెప్పి కేసీఆర్ నియంత అని మేం ప్రజాస్వామ్యవాదులమని ప్రజలను నమ్మించి ఎన్నికల్లో గెలిచారన్నారు. అధికార పీఠం ఎక్కిన వెంటనే రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరించటం సరికాదన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను యూనివర్సిటీకే చెందేటట్లుగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ముందస్తు అరెస్టులపై మండిపాటు

పోలీసులు ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ అన్నారు. చేవెళ్లలో వారిని పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల వేలానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ధర్నాకు పిలుపునిచ్చాయని, ధర్నాకు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేయటం సరైనది కాదన్నారు. భూములను యూనివర్సిటీకే అందించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, చందు, రమేష్, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల పోరాటానికి అండగా ఉంటాం

తాండూరు టౌన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థుల పోరాటానికి పీడీఎస్‌యూ, సీఐటీయూ అండగా ఉంటుందని పలువురు వామపక్ష నాయకులు పేర్కొన్నారు. హెచ్‌సీయూలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మంగళవారం తాండూరు పట్టణంలోని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్, నాయకుడు ప్రకాశ్‌తో పాటు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్‌ను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏడో హామీ ప్రజాస్వామ్య పరిరక్షణను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, సతీష్ పేర్కొన్నారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలను అమ్మేందుకు అక్కడి విద్యార్థులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో చలో హెచ్‌సీయూ పిలుపు ఇచ్చిన సందర్భంగా మంగళవారం తెల్లవారుజామునుంచే ఎస్ఎఫ్ఐ, సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పచ్చని సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్‌లకు ముట్టజెప్పేందుకు చేస్తున్న కుట్రలను వెంటనే ఆపాలన్నారు. అరెస్టయిన వారిలో సత్యనారాయణ, దశరథ్, సిద్దార్థ్, రేహాన్ తదితరులు ఉన్నారు.



అనంతగిరి: పోలీసుల అదుపులో సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు



తాండూరు టౌన్: పోలీసుల అదుపులో వామపక్ష విద్యార్థి, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాపాలనలో ఇంత అప్రజాస్వామికమా?

పరిగి: ప్రజా పాలనలో ఇంత అప్రజాస్వామికమా? అని సీపీఎంజిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులు, యూనియన్ నాయకుల మీద పోలీసుల దాడులు, నిర్బాందాన్ని ఖండిస్తూ యూనివర్సిటీ ఎదుట సీపీఎం మంగళవారం ధర్నాకు పిలుపు నివ్వడంతో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజల భూములను అమ్ముకుంటారా? అని ప్రశ్నించారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అమ్ముకునేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. పోలీసులు ఇష్టానుసారంగా విద్యార్థులపై లాఠీచార్జి చేయడం బాధాకరమన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: హైదరాబాద్ యూనివర్శిటీ భూములను పరిరక్షించాలని ఏఐఎస్ఎఫ్ చేస్తున్న పోరాటానికి మద్దతుగా హైదరాబాద్‌కు వెళ్తున్న సీపీఐ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ యూనివర్శిటీకి చెందిన భూములను ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని సీపీఐ నాయకులు ఇందనూర్ బషీర్, సిరుసని శ్యాంసుందర్‌లు ఆరోపించారు. విద్యాలయానికి చెందిన భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు.

అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి బదిలీ

తాండూరు రూరల్: అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి భవానీ బదిలీ అయ్యారు. అల్లాపూర్ గ్రామం నుంచి బదిలీ చేయాలని ఆమె గతంలో డీపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో నాలుగు రోజుల క్రితం భవానీ ధారూర్ మండలం మోమిన్‌కలాన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. సిరిగిరిపేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కరుణకర్ రెడ్డికి అల్లాపూర్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

డప్పు కృష్ణ ఆశయ సాధనకు కృషి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: కులవివక్ష నిర్మూలనకు కృషి చేసి ఉద్యమాన్ని నడిపించిన డప్పు కృష్ణ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కామ్రేడ్ డప్పు కృష్ణ 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డప్పు కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. రైతుల కోసం భూ ఉద్యమంలో, ఇళ్ల స్థలాల ఉద్యమంలో ఆయన ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, అంటరానితనాన్ని రూపుమాపడం కోసం జరిగిన ఉద్యమంలో డప్పు కృష్ణ చురుకైన పాత్ర పోషించారన్నారు. అదేవిధంగా పేదలకు ఇళ్లు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ప్రజలను చైతన్య పరిచి గ్రామాల్లో డప్పు కృష్ణ సైకిల్ యాత్ర నిర్వహించారన్నారు. కులవివక్ష నిర్మూలనకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.



డప్పు కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కేంద్ర పథకాలు ఇంటింటికీ చేరాలి

సెన్సార్‌బోర్డు సభ్యుడు మల్లేశ్‌పటేల్

పూడూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ చేరాలని సెన్సార్‌బోర్డు సభ్యుడు మల్లేశ్‌పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గొంగుపల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఎంపీ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. రేషన్ షాప్‌లో సన్నబియ్యాన్ని పరిశీలించారు. రేషన్‌షాప్‌లో ప్రధానీ మోదీ చిత్రపటాన్ని పెట్టేలా చూడాలని నాయకులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రతీ పథకంలో కేంద్రం వాట ఉంటుందన్నారు. ఈ విషయం ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కో లబ్ధిదారునికి 5కిలోల బియ్యం కేంద్రం ఇస్తే, కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ప్రతీ గ్రామానికి సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీ నిధులను మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాఘవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, బూత్ అధ్యక్షుడు మహేశ్, యూత్‌వైస్ ప్రెసిడెంట్ శ్రీహరిచారి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, శక్తి కేంద్రం ఇన్‌చార్జి సత్తయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: గొంగుపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

కాంగ్రెస్ పాలనలో ఆదర్శంగా పల్లెలు: భీంరెడ్డి

కుల్కచర్ల: కాంగ్రెస్ పాలనలో పల్లెలు ఆదర్శంగా మారనున్నాయని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో ఉపాధిహామీ నిధులు రూ.5లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి రహదారులు ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసరమైన సీసీరోడ్ల ఏర్పాటు, మురుగుకాల్వల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, వీధిదీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనందం, నాయకులు జోగు వెంకటయ్య, క్రిష్ణారెడ్డి, కృష్ణయ్య, ఎల్లయ్య, వెంకట్రాములు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

గ్రూప్-1లో మెరిసిన యువకుడికి సన్మానం

ఆమనగల్లు: పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీకి చెందిన కావటి యాదయ్య, పార్వతమ్మ దంపతుల కుమారుడు మల్లేశ్‌యాదవ్ గ్రూప్-1లో ప్రతిభ చూపి మంచి ర్యాంకు సాధించారు. ఆయన ఇదివరకే మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై సత్తాచాటగా.. తాజాగా వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో మెరిట్ లిస్ట్‌లో రాష్ట్రస్థాయి 187వ ర్యాంకు సాధించాడు. మల్టీజోన్-2 విభాగంలో 92వ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, మాజీ ఎంపీపీ లలితవెంకటయ్యలు అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శ్రీశైలం, విజయ్‌కృష్ణ, నర్సింహ, మాజీ సర్పంచ్ బక్కి కుమార్, గిరి, శ్రీనివాస్, కరుణకర్, భరత్, శ్రీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మల్లేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రోహిత్‌రెడ్డి

కొందుర్గు: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని శ్రీరంగాపూర్‌కు చెందిన బీమిడి రోహిత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి రోహిత్‌రెడ్డికి నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా రోహిత్‌డ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు రైతుల అభ్యున్నతికి, పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న రోహిత్‌రెడ్డి